

# ఔర్ ఏక్‌బార్ బీఆర్‌ఎస్

- మరోసారి గులాబీదే అధికారం
- ప్రజాదరణలో ఎదురులేని కేసీఆర్
- గులాబీ పార్టీ వైపే 40.3% ఓటర్లు
- బీఆర్‌ఎస్‌కు 69-77 సీట్లు ఖాయం
- 31 సీట్లతో ప్రతిపక్షంలోనే కాంగ్రెస్
- బీజేపీకి రెండంకెల సీట్లు కూడా రావు
- పొలిటికల్ గ్రాఫ్ రిసెర్చ్, మిషన్ చాణక్య సర్వేల్లో వెల్లడి



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ)/ఖైరతాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై దాదాపు ఇప్పటివరకూ వెలువడిన సర్వేలన్నీ బీఆర్‌ఎస్‌దే మరోసారి అధికారం అని అంచనా వేశాయి. గులాబీ పార్టీ హ్యాట్రిక్ పక్కా.. అని మరో రెండు సర్వేలు తేల్చాయి. ఏకంగా 69-77 స్థానాలను కైవసం చేసుకొని మూడోసారి కేసీఆర్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని, ప్రతిపక్షాలు సమీప దూరంలో కూడా నిలవకుండా తెలంగాణ ప్రజానీకం మరోసారి సంచలన తీర్పు ఇవ్వనున్నారని పొలిటికల్ గ్రాఫ్ రిసెర్చ్ సర్వే తేల్చగా.. బీఆర్‌ఎస్ పక్షాన రాష్ట్రంలో 48% మంది ప్రజానీకం ఉన్నారని మిషన్ చాణక్య సర్వే స్పష్టం చేసింది. 119 నియోజకవర్గాల్లో సర్వే చేసిన పొలిటికల్ గ్రాఫ్ రిసెర్చ్ బృందం సోమవారం తమ నివేదికను విడుదల చేసింది. సెప్టెంబర్ 25 నుంచి నవంబర్ రెండో తేదీ వరకు నిర్వహించిన ఈ సర్వేలో పలు అంశాలపై ఓటర్ల మనోగతాన్ని తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఏ యే పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? ఎంత శాతం ఓట్లను కైవసం చేసుకోనున్నారు? అనే అంశాలతో పాటు ఏయే జిల్లాలో ఎన్ని సీట్లు రానున్నాయనేది నివేదికలో స్పష్టం చేశారు.

### బీఆర్‌ఎస్‌కు తగ్గని ఆదరణ

ఈ సర్వేలో బీఆర్‌ఎస్‌కు ఏమాత్రం ఆదరణ తగ్గలేదని స్పష్టమైంది. 119 నియోజకవర్గాల్లో ఏకంగా 40.3% ఓట్లను సొంతం చేసుకోనుందని సర్వేలో తేలింది. రెండో స్థానంలో నిలిచే కాంగ్రెస్‌కు 31.8% ఓట్లు రానుండగా... బీజేపీకి 16.4% ఓట్లు వస్తాయని పేర్కొంది. మజ్లిస్‌కు 3.2%, కమ్యూనిస్టులకు 2.1% ఓట్లు రానుండగా ఇతరులకు 4.3% ఓట్లు రానున్నాయి.

### బంపర్ మెజార్టీ

సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ విజయఢంకా మోగించనుందని సర్వేలో స్పష్టమైంది. బీఆర్‌ఎస్ ఏకంగా 69 నుంచి 77 స్థానాలను కైవసం చేసుకోనుందని నివేదికలో తెలిపారు. రెండో స్థానంలో ఉండే కాంగ్రెస్ పార్టీకి 31 నుంచి 39 స్థానాల వరకు రావచ్చని తేల్చారు. బీజేపీ 2 నుంచి ఆరు స్థానాలకు పరిమితం కానుండగా, మజ్లిస్ తన ఏడు స్థానాలను నిలబెట్టుకోనున్నదని తేల్చారు.

### అన్ని జిల్లాల్లోనూ అదే జోరు..

ఈ సర్వేలో పాత జిల్లాలవారీగా ఏయే పార్టీకి ఎన్ని స్థానాలు రానున్నాయనే వివరాలను కూడా పేర్కొన్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ అన్ని జిల్లాల్లోనూ తన జోరును కొనసాగించింది. అత్యధికంగా రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో ఆ పార్టీకి పది స్థానాలు రానున్నాయి. కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 9 చొప్పున, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో 7 చొప్పున గెలుచుకోనున్నది. హైదరాబాద్ జిల్లాలో 7 స్థానాలు మజ్లిస్‌కు పోగా, 6 స్థానాలను గులాబీ పార్టీనే కైవసం చేసుకోనున్నది. నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో మాత్రం కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్ కంటే ఎక్కువ స్థానాలు రానున్నట్టు సర్వేలో తేలింది. ఇక్కడ కాంగ్రెస్ 7 చొప్పున స్థానాలను కైవసం చేసుకోనుండగా, బీఆర్‌ఎస్‌కు నల్లగొండలో 5, ఖమ్మంలో 3 స్థానాలు దక్కనున్నాయి. బీజేపీ కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఒక్కో స్థానంతో పాటు హైదరాబాద్‌లో 2 స్థానాలను గెలుచుకోనుందని పేర్కొన్నారు.

**ప్రజలకు కేసీఆరే కావాలి : మిషన్ చాణక్య**

రాష్ట్ర ప్రజలు ఇప్పటికీ సీఎంగా కేసీఆర్‌నే కోరుకుంటున్నారని, అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడు ఆయనేనని మరో సర్వే తేల్చింది. ప్రఖ్యాత సర్వే సంస్థ 'మిషన్ చాణక్య' తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. రాష్ట్రంలోని 56.41% మంది ప్రజలు సీఎంగా కేసీఆర్ ఉండాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ గెలిస్తే తానే సీఎం అవుతానంటూ రేవంత్‌రెడ్డి చేసుకున్న ప్రచారాలు, బీజేపీ చేసిన బీసీ సీఎం ప్రకటన వంటివి కేసీఆర్ కరిష్మా ముందు తేలిపోయాయని పేర్కొన్నది.

### 48 శాతం ఓట్లు ఖాయం

బీఆర్‌ఎస్‌కు 48% ఓట్లు పడే అవకాశం ఉన్నదని సునీల్ వీర్ అండ్ టీం అంచనా వేసింది. తాము ఈ ఏడాది జూన్ 3వ తేదీ నుంచి ప్రతి జిల్లాకు అభిప్రాయాలను సేకరించామని సభ్యులు తెలిపారు. ఈసారి 79% వరకు పోలింగ్ నమోదయ్యే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. మొత్తం పోలయ్యే ఓట్లలో.. బీఆర్‌ఎస్‌కు 48%, కాంగ్రెస్‌కు 31%, బీజేపీకి 10% ఓట్లు రావొచ్చన్నారు.

| పార్టీలవారీగా సీట్లు... | |
|---|---|
| బీఆర్‌ఎస్: | 73 +/- 4 |
| కాంగ్రెస్: | 35 +/- 4 |
| బీజేపీ: | 4 +/- 2 |
| మజ్లిస్: | 7 |
| మొత్తం: | 119 |

| ఓట్ల శాతం పార్టీల వారీగా... | |
|---|---|
| బీఆర్‌ఎస్: | 40.3 |
| కాంగ్రెస్: | 31.8 |
| బీజేపీ: | 16.4 |
| మజ్లిస్: | 3.2 |
| సీపీఐ, సీపీఎం: | 2.1 |
| ఇతరులు: | 4.3 |
| చెప్పలేం/తెల్వదు: | 1.9 |



ఎల్లారెడ్డిపేట యువ ఆత్మీయ సభలో యువకులతో కలిసి స్టెప్పులేస్తున్న మంత్రి కేటీఆర్

## 30న కేసీఆర్ సినిమా బ్లాక్‌బస్టరే

- కోహ్లీలా కేసీఆర్ సెంచరీ కొట్టుడే..
- వంద సీట్లతో ప్రభుత్వ ఏర్పాటు
- రాహుల్‌గాంధీ, నరేంద్రమోదీ అహంకారాన్ని అణచివేసే సత్తా తెలంగాణ బిడ్డలకున్నది
- వేములవాడ, ఎల్లారెడ్డిపేట యువ ఆత్మీయ సభల్లో మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఈ నెల 30న జరుగనున్న ఎన్నికల్లో కేసీఆర్ సినిమా బ్లాక్ బస్టర్ కొట్టుడు ఖాయమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. నిన్న విరాట్ కోహ్లీ సెంచరీ కొట్టినట్టు.. ఎన్నికల్లో కేసీఆర్ వంద సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం పక్కా అని ధీమా వ్యక్తంచేశారు. నవంబర్ 30న జరుగుతున్న ఎన్నికలు ఢిల్లీ దొరలు.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు మధ్యేనని చెప్పారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ తెలంగాణను ఆగంచేసి ఓట్లు తమ ఖాతాలో వేసుకొనేందుకు తండ్లాడుతున్నారని విమర్శించారు. సెంటిమెంట్.. ఆయింట్‌మెంట్లకు లొంగిపోతే మన బతుకులు ఆగమైపోతాయని హెచ్చరించారు. సోమవారం కేటీఆర్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించారు. వేములవాడ పట్టణం, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనాలకు హాజరై, యువకులను ఉద్దేశించి ప్రసంగించారు. రాహుల్‌గాంధీ, నరేంద్రమోదీ అహంకారాన్ని పీచమణిచే విధంగా తిరుగులేని సమాధానం చెప్పే సత్తా మన తెలంగాణ బిడ్డలకు ఉన్నదని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థులు, నాయకులకు టికెట్ కావాలన్నా, బీ ఫాం కావాలన్నా, మంత్రులు కావాలన్నా ఢిల్లీకి పోవాల్సిందేనని.. బీజేపీ నేతల పరిస్థితి కూడా అంతేనని, అక్కడి నుంచి అమిత్‌షా, యోగీ, బోగీలు రావాలని ఎద్దేవా చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడే ఎన్నికల్లో పోటీ చేయలేక తప్పించుకొని పారిపోయాడని అన్నారు.

### కాంగ్రెస్ సినిమా అట్టర్‌ఫ్లాప్

'కాంగ్రెసోడి సినిమాకు కన్నడ ప్రొడ్యూసర్, ఢిల్లీ డైరెక్టర్, గుజరాత్ యాక్టర్.. సినిమా అట్టర్ ఫ్లాప్.. మనది బ్లాక్‌బస్టర్.. వాళ్లది డిజాస్టర్' అని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'రేపు తెలంగాణను ఎవరు నడపాలనేది డిసైడ్ చేయాల్సింది రాహుల్, మోదీ కాదు.. తెలంగాణ ప్రజలు డిసైడ్ చేయాలి. మళ్లా ఢిల్లీకి మన జుట్టు ఇస్తే 6 నెలలకు ఒక సీఎం దిగుతడు. ఏదో మాట్లాడి ఆగంజేస్తరు' అని హెచ్చరించారు. వేములవాడ నియోజకవర్గాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. తనను తన కార్యకర్తలే భారీ మెజార్టీతో గెలిపిస్తారన్న నమ్మకం ఉన్నదని తెలిపారు. వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, సెస్ చైర్మన్ రామారావు, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పాల్గొన్నారు.

### కేటీఆర్ అదిరిపోయే స్టెప్పులు

'గిరగిర ఔర్ ఏక్‌ధక్కా.. గింగిర గిర కేసీఆర్ పక్కా.. దేఖ్‌లేంగే' అంటూ మంత్రి కేటీఆర్ హుషారుగా స్టెప్పులేశారు. ఎల్లారెడ్డిపేట యువ ఆత్మీయ సమ్మేళనంలో ఆహూతుల ప్రసంగాలు పూర్తయిన అనంతరం, బిగ్‌స్క్రీన్‌పై దేఖ్‌లేంగే పాట వేశారు. యువ నాయకులు రిథమ్‌కు తగ్గట్టుగా పాటపై డ్యాన్స్ చేస్తుండగానే, కేటీఆర్ వారిలో మరింత ఉత్సాహం నింపేందుకు వచ్చి స్టెప్పులేశారు. గులాబీ కండువాను పైకెత్తి ఊపుతూ అక్కడున్నవారిలో జోష్ నింపారు. సభా ప్రాంగణమంతా ఈలలు, కేరింతలతో మార్మోగింది.

# సమర్థ లీడర్.. సుస్థిర సర్కార్

## కాళేశ్వరంపై ఇచ్చింది ఎన్‌డీఎస్‌ఏ రిపోర్ట్ కాదు.. ఎన్డీయే రిపోర్ట్

**మోదీ, రాహుల్‌గాంధీ కూడబలుక్కొని కుట్ర చేస్తున్నారు.. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు బీఆర్‌ఎస్‌కే ఓట్లు**

**80వేల కోట్ల ప్రాజెక్ట్‌లో లక్ష కోట్ల అవినీతి ఎలా సాధ్యం?.. అతితక్కువ కాలంలో ఎక్కువ ప్రభుత్వోద్యోగాలిచ్చింది తెలంగాణే**

**ప్రొఫెసర్ నాగేశ్వర్ ఇంటర్వ్యూలో మంత్రి కేటీఆర్**



హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): 'మనకేదైనా అనారోగ్యం వస్తే ఎప్పుడూ వెళ్లే డాక్టర్ వద్దకే వెళ్తాం తప్ప.. కొత్త డాక్టర్ దగ్గరికి వెళ్లం. అలాగే తెలంగాణ ఇంటి పెద్ద, నాలుగుకోట్ల కుటుంబ పెద్ద కేసీఆర్‌నే ప్రజలు ఎంచుకుంటారు.. ఓటేసి మళ్లీ గెలిపిస్తారు' అని రాష్ట్ర మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు (కేటీఆర్) ధీమా వ్యక్తంచేశారు. కేసీఆర్‌ను మించిన మంచి పాలకుడెవరున్నారని, ఏబుల్ లీడర్.. స్టేబుల్ గవర్నమెంట్‌ను ప్రజలు ఎన్నుకుంటారని ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణ అనే కుటుంబంలో సణుగుడు, అలుగుడు ఉన్నా ఆఖరుకు ఓట్లు మాత్రం బీఆర్‌ఎస్‌కే వేస్తారని విశ్వాసం వ్యక్తంచేశారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి కేటీఆర్ పలు సమకాలిన అంశాలపై ముచ్చటించారు. ఉద్యమాన్ని నిర్మించింది.. రాష్ట్రాన్ని తెచ్చింది కేసీఆరేనన్న విశ్వాసంతో ప్రజలు రెండుసార్లు అధికారిన్నిచ్చిన విషయాన్ని మరిచిపోరాదని అన్నారు. ఈసారి కూడా అదే పునరావృతమవుతుందని చెప్పారు. 50 ఏండ్లు పాలించి కరెంట్, సాగు, తాగునీరు ఇవ్వనోళ్లకు ఓటేస్తే వాళ్లు చేసేదేమీ ఉండదని ప్రజలకు తెలుసునని అన్నారు.

### శంకరాచార్యులకు.. పీర్ల పండుగకు ముడిపెట్టలేం..

బీఆర్‌ఎస్ ఎవరికీ బీ టీమ్‌కాదని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. శంకరాచార్యులకు.. పీర్లపండగకు ముడిపెట్టినట్టు.. బీజేపీతో బీఆర్‌ఎస్‌ను జతచేయలేరని పునరుద్ఘాటించారు. బీఆర్‌ఎస్ బీజేపీకి బీ టీమ్ అయితే కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై తప్పుడు నివేదికలు ఎలా వస్తాయని కేటీఆర్ ప్రశ్నించారు. తాము పార్లమెంట్ వేదికగా యూనిఫాం సివిల్‌కోడ్‌ను, వ్యవసాయ బిల్లులను వ్యతిరేకించామని గుర్తుచేశారు. మోదీని ఫాసిస్ట్ అన్న మొదటి సీఎం కేసీఆరేనని.. సీలేరు జల విద్యుత్తు కేంద్రాన్ని ఏపీకి కేటాయించడాన్ని తప్పుబట్టామని చెప్పారు.

### కాంగ్రెస్‌కు మూడు కమాండ్‌లు..

కాంగ్రెస్‌కు ఇది వరకు హైకమాండ్ ఉండేదని, కానిప్పుడు మూడు కమాండ్‌లున్నాయని కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీలో హై కమాండ్.. బెంగళూరులో న్యూ కమాండ్.. హైదరాబాద్‌లో లో కమాండ్‌లున్నాయని దుయ్యబట్టారు. కాంగ్రెస్ టికెట్ల కోసం నేతలు ఢిల్లీ కన్నా ఎక్కువగా బెంగళూరుకే వెళుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లో పాచిపోయిన పాత ముఖాలు తప్ప కొత్తదనమేమిలేదని అన్నారు.

### ఏబుల్ లీడర్.. స్టేబుల్ గవర్నమెంట్‌నే..

రాష్ట్రంలో హంగ్ వార్తలను కేటీఆర్ తోసిపుచ్చారు. రాష్ట్రంలో అలాంటి అవకాశమే లేదన్నారు. ప్రజలకు స్పష్టమైన తీర్పునివ్వడం అలవాటని, ఇప్పుడూ అదే జరుగుతుందని చెప్పారు. తెలంగాణలోనూ ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అంతా ఒకే తరహా తీర్పునిస్తారని విశ్వాసం వ్యక్తంచేశారు.

### అది ఎన్‌డీఎస్‌ఏ కాదు.. ఎన్డీయే రిపోర్టు

కాళేశ్వరం పాజెక్ట్‌పై కాంగ్రెస్, బీజేపీ నేతల వ్యాఖ్యలను మంత్రి కేటీఆర్ తప్పుబట్టారు. 'కాళేశ్వరంపై ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ) రిపోర్ట్ కాదది. ఎన్డీఏ రిపోర్ట్. రెండు రోజుల్లోనే అధ్యయనంచేసి, బీజేపీ ఆఫీసులో కూర్చొని వండి వార్చిన వంటకం అది' అని కేటీఆర్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ, టెక్నికల్ అడ్వైజరీ కమిటీ అన్ని రకాల పర్మిషన్లు ఇచ్చిందని, సీడబ్ల్యూసీ ఇంజినీర్లు పరిశీలించి ఇంజినీరింగ్ మార్వెల్ అని ప్రకటించిన తర్వాత ఇలాంటి నివేదికలతో గందరగోళం సృష్టించడం దురదృష్టకరమని అన్నారు. 'కాళేశ్వరం వల్లే రాష్ట్రంలో వ్యవసాయ విస్తరణ 500 శాతం పెరిగింది. కాళేశ్వరమే లేకపోతే.. 68లక్షల నుంచి 3.5 కోట్ల మెట్రిక్ టన్నులు పండించే స్థాయికి ఎలా ఎదిగింది?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. గతంలో ప్రకాశం, ఫరక్కా, ధవళేశ్వరం బ్యారేజీల్లోను ఇంజినీరింగ్ లోపాలు తలెత్తాయని, ఇది కూడా అలాంటిదేనని చెప్పారు.

### కేసీఆర్‌ను తెలంగాణకే పరిమితం చేద్దామనే

కేసీఆర్‌ను తెలంగాణకే పరిమితం చేసేలా కాంగ్రెస్, బీజేపీ కుట్రలు పన్నుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. మోదీ, రాహుల్‌గాంధీ కూడబలుక్కొని కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. మోదీకి, రాహుల్‌కు కేసీఆర్ కొరకరాని కొయ్యలా తయారయ్యారని అన్నారు. కేసీఆర్ తెలంగాణ దాటి మహారాష్ట్ర, ఏపీ, కర్ణాటక రాకుండా ఇక్కడే గొంతునులిమేయాలన్న కుట్రతోనే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు.

### 80వేల కోట్ల ప్రాజెక్ట్‌లో లక్ష కోట్ల అవినీతి ఎలా?

కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను రూ. 80వేల కోట్లతో నిర్మిస్తే.. లక్షకోట్ల అవినీతి ఎలా జరుగుతుందని కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ లక్ష కోట్ల అవినీతి జరిగిందనడం హాస్యాస్పదమని అన్నారు. భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా లిఫ్ట్‌చేయకుండా నీళ్లు అందించలేమని, దీనికి మించిన మరో ప్రత్యామ్నాయం లేదని చెప్పారు. కృష్ణా గోదారుల్లోని ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలన్నా.. మన వాటాను మనం వాడుకోవాలన్నా ఎత్తిపోతలకు మించిన మరో ప్రత్యామ్నాయం లేదని అన్నారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల అంచనా వ్యయం రూ. 40వేల కోట్లు కాగా, దీంట్లో పంపులు, కాల్వలు తప్ప ఒక్క రిజర్వాయర్ కూడా లేదని తెలిపారు. స్టోరేజీ లేకుండా నీళ్లను ఎత్తిపోసేంత గొప్పగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను డిజైన్ చేసిందని ఎద్దేవా చేశారు. అదే తాము 147 టీఎంసీల అదనపు స్టోరేజీ సామర్థ్యం గల రిజర్వాయర్లను నిర్మించామని చెప్పారు.

### 70 గంటల పనివిధానం సరికాదు

స్మార్ట్ వర్క్ చేయాలి.. హార్డ్ వర్క్ కాదని కేటీఆర్ తెలిపారు. '70 గంటల పనివిధానం సరికాదు. ఇప్పుడు పనంతా స్మార్ట్ వర్క్ అయిపోయింది. సెల్‌ఫోన్‌తోనే ఆఫీసు పనికూడా చేస్తున్నారు. అటువంటప్పుడు పనిని ఇన్ని గంటలు అని ఎలా లెక్కిస్తారు? ఎంత పనిచేశామో చూడాలి తప్ప.. ఎన్ని గంటలు పనిచేశామో చూడడం నిరర్థకం' అని అన్నారు. దక్షిణాది నుంచి హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ రికార్డు సృష్టించబోతున్నారని, అదే తమ మొదటి ప్రాధాన్యమని చెప్పారు. మహామహులు ఎన్టీఆర్, ఎంజీఆర్, కరుణానిధి, జయలలితతో పాటు అనేకమంది సాధించలేనిది.. కేసీఆర్ సాధించబోతున్నారని అన్నారు. మహారాష్ట్రలో ఎక్కువ ప్రభావితం చేస్తామని, ఏపీ, కర్ణాటకలోనూ అడుగు పెట్టబోతున్నామని చెప్పారు. జాతీయ పార్టీ అంటే ఎమర్జెన్సీగా 28 రాష్ట్రాల్లో పోటీ చేయాలని ఏమీ లేదన్నారు. ఒక్కో మెట్టు ఎక్కుతూ ముందుకెళతామన్నారు. బీజేపీ కూడా 2 పార్లమెంట్ స్థానాల నుంచి 302కు ఎదిగిందని చెప్పారు.

### కాంగ్రెస్, బీజేపీ వలలో పడొద్దు

ప్రభుత్వాలను ప్రశ్నించడం ప్రజల హక్కని, అలా ప్రశ్నించినప్పుడే సుపరిపాలన సాధ్యమని మంత్రి కేటీఆర్ తెలిపారు. అలాగని స్వార్థ రాజకీయాల వలలో చిక్కుకోవద్దని, దీనివల్ల వారికే నష్టం జరుగుతుందని సూచించారు. రాష్ట్రంలో యువతను తప్పుదారి పట్టించేందుకు కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. దేశంలోనే అతితక్కువ కాలంలో ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీకేజీ కేసును ప్రతిపక్షాలేమోమీ శోధించి కనుక్కోలేదని, ప్రభుత్వమే స్వయంగా గుర్తించిందని తెలిపారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో ఉన్నది బీజేపీనేనని తేలిందని, చివరికి.. పదో తరగతి ప్రశ్నపత్రాలను కూడా లీకేజీ చేసిన వెధవ బండి సంజయ్ అని మండిపడ్డారు. గ్రూప్-2 పరీక్షను రద్దు చేయాలని బండి సంజయ్, రేవంత్‌రెడ్డి, ఆర్‌ఎస్ ప్రవీణ్ డిమాండ్ చేశారని, ఆ తర్వాత ఒక అమ్మాయి వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వం గ్రూప్-2ను రద్దు చేయడం వల్లేనని మాట మార్చేశారని గుర్తుచేశారు.

# బీసీ కుల గణన ఎందుకు చేయరు?

- బీసీల జీవితాలతో బీజేపీ ఆటలు
- కులగణనను అడ్డుకున్నది కాంగ్రెస్
- బీసీలపై ఆ పార్టీలవి ఉత్తిత్తి మాటలే..
- మోదీకి ప్రేముంటే మంత్రిత్వశాఖ ఏదీ?
- పులి.. కేసీఆర్‌ను చూసి రేవంత్, ఈటల రాజేందర్ వాతలు
- బోధన్‌లో షకీల్‌ను గెలిపించండి
- 'కుల సంఘాల గర్జన'లో కవిత



బోధన్‌లో అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో ఎమ్మెల్యే షకీల్, పొన్నాల, ఎంపీలు

నిజామాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/బోధన్: దేశవ్యాప్తంగా బీసీ కుల గణనను ఎందుకు చేపట్టడం లేదో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. అసలు చేస్తారా.. చేయరా? అని మోదీని నిలదీశారు. కుల వృత్తులకు చేయూతనివ్వకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీల జీవితాలతో ఆడుకుంటున్నదని ధ్వజమెత్తారు. బ్యాక్‌లాగ్ పోస్టులు ఎందుకు భర్తీ చేయడం లేదని, ఓబీసీ రిజర్వేషన్లు ఎందుకు సక్రమంగా అమలు చేయడం లేదని కేంద్రాన్ని నిలదీశారు. దేశంలో బీసీలకు ఇంత అన్యాయం జరుగుతున్నా ప్రశ్నించకుండా కాంగ్రెస్ పనికిరాని ప్రతిపక్ష పార్టీగా మారిందని విమర్శించారు. ఎన్నికలు ఉన్నాయి కాబట్టే బీసీలపై మొసలి కన్నీరు కారుస్తున్నాయని ఫైరయ్యారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఎమ్మెల్యే షకీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'కుల సంఘాల గర్జన' సభలో, నిజామాబాద్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. మంగళవారం తెలంగాణకు వస్తున్న ప్రధాని మోదీ బీసీలకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తామని, బీసీల కులగణనపై సానుకూల ప్రకటన చేయాలని డిమాండ్‌చేశారు. ఎన్నికలు ఉన్నాయి కాబట్టి ఇక్కడికి వచ్చి ఉత్తిమాటలు చెప్పవద్దని హితవు పలికారు. మోదీ వెళ్లిన తర్వాత రాహుల్‌గాంధీ వచ్చి మళ్లీ బీసీలపై మొసలి కన్నీరు కార్చుతారని విమర్శించారు.

### బీసీ సీఎం శుష్క నినాదం

పార్టీ రాష్ట్ర బీసీ అధ్యక్షుడిని తొలగించి కొత్తగా బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పడం హాస్యాస్పదమని కవిత ఎద్దేవా చేశారు. బీసీ సీఎం నినాదం బీజేపీకి రాజకీయ నినాదమని, అదో శుష్క, శూన్య నినాదంగా అభివర్ణించారు. అధికారంలోకి రాకుండా బీసీ ముఖ్యమంత్రిని ఎక్కడి నుంచి చేస్తారని ప్రశ్నించారు. నిజామాబాద్ అర్బన్‌లో కాంగ్రెస్ నుంచి షబ్బీర్ అలీ పోటీ చేయడంపై కవిత స్పందించారు. కామారెడ్డిలో చెల్లని రూపాయి నిజామాబాద్‌లో ఎలా చెల్లుతుందని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ రెండుచోట్ల పోటీచేస్తున్నారు కాబట్టి తామూ రెండు చోట్ల పోటీచేస్తామని రేవంత్‌రెడ్డి, ఈటల సిద్ధమయ్యారని, ఇది పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్టేనని ఎద్దేవా చేశారు. వాళ్లు మూడుచోట్ల పోటీ చేసినా అంతిమంగా గెలిచేది బీఆర్‌ఎస్ పార్టీయేనని స్పష్టంచేశారు. నిజామాబాద్ అర్బన్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తా భారీ మెజార్టీతో గెలుస్తారని చెప్పారు. బోధన్ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకొనే షకీల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

### కాళేశ్వరంపై రాజకీయ ఆరోపణలు: పొన్నాల

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలన్నీ రాజకీయ కోణంలో చేస్తున్నవేనని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య అన్నారు. దీనిపై తాను ఏ చర్చకైనా సిద్ధమేనంటూ సవాల్ విసిరారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలంతా మంచీ చెడును గ్రహించాలని బీఆర్‌ఎస్ నేత కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు.

## మూలధన వ్యయంలో తెలంగాణ టాప్

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): మూలధన వ్యయంలో, సంపద సృష్టిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచే మూలధన వ్యయంపై సీఎం కేసీఆర్ శ్రద్ధ పెట్టారు. ఫలితంగా అనతికాలంలోనే తిరుగులేని ఆర్థిక శక్తిగా ఎదిగింది. వార్షిక మూలధన వ్యయంలో ఏకంగా 190% పెరుగుదలతో 18 రాష్ట్రాలను వెనక్కి నెట్టి దేశంలోనే అగ్రస్థానానికి దూసుకెళ్లింది. 2014-15లో రూ.8,097 కోట్లుగా ఉన్న తెలంగాణ మూలధన వ్యయం గత సంవత్సరంలో రూ.18,007 కోట్లకు చేరింది. అంటే.. గత తొమ్మిదేండ్లలో రాష్ట్ర మూలధన వ్యయం రూ.9,910 కోట్లు పెరిగింది. మూలధన వ్యయంలో తెలంగాణ తర్వాత ఆంధ్రప్రదేశ్ 142% వృద్ధితో ద్వితీయ స్థానంలో నిలువగా 87% వృద్ధితో ఒడిశా తృతీయ స్థానంలో నిలిచింది.

### కేసీఆర్ పనితీరుకు నిదర్శనం..

> మూలధన వ్యయంలో తిరుగులేదని మరోసారి రుజువైంది. దేశంలోని 18 పెద్ద రాష్ట్రాలను వెనక్కి నెట్టి తెలంగాణ అగ్రగామిగా ఎదడగం హర్షణీయం. సీఎం కేసీఆర్ సమర్థ పాలనకు, సుస్థిర ప్రభుత్వానికి ఇది ప్రబల నిదర్శనం.
>
> - కే తారక రామారావు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

# మోదీ.. బీసీల మోసకారి

- 'బీసీ ప్రధాని'నని ప్రచారం
- వారికి చేసింది మాత్రం శూన్యం
- పదేండ్లుగా మంత్రిత్వశాఖ ఊసే లేదు
- 2018లో హామీ ఇచ్చి ధోకా

### బీజేపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు..

*2010లో బీజేపీ ఎంపీ గోపీనాథ్ ముండే పార్లమెంట్‌లో మాట్లాడుతూ.. '2011 జనాభా లెక్కల్లో బీసీ కులగణన చేయకపోతే వారికి సామాజిక న్యాయం చేయడం సాధ్యం కాదు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న బీసీలకు అన్యాయం చేయడమే' అని పేర్కొన్నారు.*

### బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత..

- *2015లో అప్పటి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ (దివంగత) మాట్లాడుతూ.. '2011లో కేంద్రం సేకరించిన కుల గణన డాటాను బహిర్గతం చేస్తాం' అని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ బహిర్గతం కాలేదు.*
- *2018 ఆగస్టు 31న అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. '2021 జనాభా గణనలో కుల గణన నిర్వహిస్తాం' అని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు చేపట్టలేదు.*
- *2021 సెప్టెంబర్‌లో 'జనగణనలో బీసీ కులాల గణన చేయడం సాధ్యం కాదు' అని కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టుకు తేల్చిచెప్పింది.*

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఈ ఉదాహరణలు చాలు బీసీలపై బీజేపీకి ఉన్న ప్రేమ తెలియడానికి. తాను బీసీ ప్రధానినని మోదీ చెప్పుకోవడానికే తప్ప.. బీసీలకు చేసిందేమీలేదని దేశవ్యాప్తంగా ఎప్పటి నుంచో విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రధాని మోదీ నిర్ణయాలు, బీజేపీ చర్యలు దీనికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. బీసీ కులగణనపై బీజేపీ అధికారంలోకి రాకముందు ఒక మాట మాట్లాడి, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చింది. ఇదే సమయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదటి నుంచీ బీసీ కులగణన చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నది. 2021లో అసెంబ్లీలో బీసీ కులగణన తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. ఒక్క తెలంగాణ మాత్రమే కాదు బీహార్, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా, జార్ఖండ్ తదితర రాష్ట్రాలు కులగణన తీర్మానాలు చేశాయి. దేశవ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాలు వందలు, వేల వినతులు ఇచ్చాయి. డిమాండ్లు చేసినా, ధర్నాలు చేసినా పట్టించుకోలేదు. బీసీల కుల గణన జరుగక సామాజికంగా వెనుకబడిన తరగతులను గుర్తించడం సాధ్యం కావడం లేదని, వారికి విద్య, ఉద్యోగ రంగాల్లో అన్యాయం జరుగుతున్నదని నిపుణులు మొత్తుకొంటున్నారు. అయినా పట్టింపులేదు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించినా.. కుల జనాభా వివరాలు లేక లాటరీ పద్ధతిలో బీసీ స్థానాలు కేటాయిస్తున్నారని, దీంతో ఎక్కువ జనాభా ఉన్న కులాలకు అన్యాయం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నా వినిపించుకోవడం లేదు. బీసీ కులాల లెక్కలు లేకపోవడం వల్ల జనాభా ప్రకారం రిజర్వేషన్లు లేవని, సబ్‌ప్లాన్ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నా ప్రధాని చెవికి చేరడం లేదు. బీసీ జాబితాలోని కులాల సంఖ్యలో మార్పులు, చేర్పులు చేయాలన్నా కులగణనే ప్రాతిపదిక అని స్పష్టం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. బీసీ ఆత్మగౌరవ సభ అంటూ బుధవారానికి రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీ ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేస్తారా? అని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### బీసీలకు మంత్రిత్వ శాఖ ఏది?

దేశ జనాభాలో దాదాపు 56 శాతంగా.. అంటే 70 కోట్ల బీసీ జనాభా ఉన్నదని, కేంద్రంలో ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉన్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే తొలి శాసనసభ సమావేశాల్లోనే 'బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి' అని 2014 జూన్ 14న రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవ తీర్మానం చేసింది. దీనిని కేంద్ర ప్రభుత్వానికి పంపింది. తర్వాత లేఖలు, డిమాండ్లు, పార్లమెంట్ వేదికగా.. ఇలా వివిధ రూపాల్లో రాష్ట్ర ప్రభుత్వం, బీఆర్‌ఎస్ ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. అయినా ఇప్పటివరకు కేంద్రం పట్టించుకోవడం లేదు. మోదీ వచ్చి బీసీ మంత్రిత్వ శాఖపై ప్రకటన చేసే అవకాశం ఉన్నదంటూ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సోమవారం పేర్కొన్నారు. దీనిని బట్టి ఎన్నికలు వస్తే తప్ప బీసీలు గుర్తుకు రారా? అని బీసీ సంఘాలు మండిపడుతున్నాయి.